క్లుప్తంగా

కలకడ ఎంపీడీఓగా భానుప్రసాద్



కలకడ : కలకడ ఎంపీడీఓగా భానుప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహించిన అబ్దుల్ రహీం ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో రామసముద్రం ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న భానుప్రసాద్ బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

ఆర్ఐగా హుసేన్



పెద్దతిప్పసముద్రం : మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)గా హుసేన్ నియమితులైనట్లు తహసీల్దార్ శ్రీరాములు నాయక్ తెలిపారు. ఈయన గతంలో కలికిరి మండలంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఆర్ఐగా పని చేస్తున్న బాలాజీ పదోన్నతిపై బదిలీ కాగా ఆయన స్థానంలో ఇక్కడే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసే చిన్నపరెడ్డి ఇన్‌చార్జి ఆర్ఐగా బాధ్యతలు నిర్వహించారు.

ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్‌గా ధనుంజయులు



పీలేరురూరల్ : పీలేరు ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా జి. ధనుంజయులు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న సుబ్బమ్మ జమ్మలమడుగు డిపోకు బదిలీ అయ్యారు. రాయచోటి డిపోలో సీఐగా పని చేస్తున్న ధనుంజయులు బదిలీపై పీలేరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



బరువు, ఎత్తు పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

పెద్దతిప్పసముద్రం : ప్రతి ఒక విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కందుకూరు పీహెచ్‌సీ డాక్టర్ అభిలాష్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఆర్‌బీఎస్ స్కూల్ ప్రోగ్రాంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎత్తు, బరువు నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు.


దీర్ఘ కాలిక వ్యాధులపై పారదర్శక సర్వే



ఎన్‌సీడీ సర్వేపై ఆరోగ్య సిబ్బంది ర్యాలీ

పీలేరురూరల్ : గ్రామాల్లో దీర్ఘ కాలిక వ్యాధులపై పారదర్శకంగా సర్వే నిర్వహించాలని కడప రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పవన్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని దొడ్డిపల్లె విలేజ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఎన్‌సీడీ 3.0 సర్వేపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక సంక్రమణ వ్యాధులైన రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ తదితర వ్యాధి గ్రస్తులను గుర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ రాధామాధవి, డాక్టర్ పి. సుబ్రమణ్యం, ఎన్‌సీడీ విభాగం లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

టెండరుదారులతో సమావేశం



టెండరుదారుల సమావేశంలో మాట్లాడుతున్న కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో వివిధ స్టాల్స్‌లను కేటాయించేందుకుగాను టెండరుదారులతో కడప డిపో మేనేజర్ డిల్లీశ్వర్‌రావు గురువారం సమావేశం నిర్వహించయారు. కడప డిపో మేనేజర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో డీఎం మాట్లాడుతూ టెండరు నిర్వహించే దుకాణాల గురించి తెలియజేశారు. బస్టాండులోని రూములు, బహిరంగ ప్రదేశాలకు సంబంధించి ఈనెల 10వ తేదీన టెండరు ద్వారా కేటాయింపులు జరుగుతాయని ఆయన వివరించారు. ఈనెల 9వ తేదీలోగా టెండర్లు దాఖలు చేసుకోవచ్చని ఆయన తెలియజేశారు. ప్రతి టెండరు దారుడు నిబంధనల మేరకు నడుచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కడప డిపో అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి, అధికారులు మంజుల, అల్లాబక్ష తదితరులు పాల్గొన్నారు.

బుద్ధ విగ్రహం ధ్వంసంపై నిరసన



ధ్వంసమైన విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బహుజనసేన నాయకులు



బాస్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులు

మదనపల్లె రూరల్ : మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ బుద్ధునికొండలో విగ్రహాలపై పలుమార్లు దాడులకు పాల్పడుతున్న ముష్కరులను వెంటనే గుర్తించి, కఠినంగా శిక్షించాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు డిమాండ్ చేశారు. గురువారం బుద్ధుని కొండను దర్శించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మతసామరస్యానికి ఆదర్శంగా, శాంతిభద్రతలకు నిలయంగా మదనపల్లె పట్టణం పేరుమోసిందన్నారు. గతంలో బుద్ధుని కొండపై జరిగిన దాడులపై పోలీసుల చర్యలు పటిష్టంగా లేకపోవడం, దుండగులను గుర్తించకపోవడం వల్లనే ఇలాంటి చర్యలు పునరావృతం అవుతున్నాయన్నారు. ఇప్పటికైనా పోలీస్ డిపార్ట్‌మెంట్ తక్షణమే స్పందించి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో బహుజనసేన నాయకులు గిన్నెల మనోహర్‌రెడ్డి, రాఘవేంద్ర యాదవ్, కుమ్ము హరిబాబు, బీసీ నాయకులు జయశంకర్, బురుజు శివశంకర్, మైనారిటీ నాయకులు నూర్‌ఆలం, మిథున్‌కుమార్, భానుప్రకాష్, రెడ్డిశేఖర్, మావిళ్ల వెంకటేష్, పలక ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాస్ ఆధ్వర్యంలో..

మండలంలోని అంకిశెట్టిపల్లె బుద్ధుని కొండపైన బుద్ధ విగ్రహాన్ని ధ్వంసం చేసి తలను వేరుచేసి కాళ్ల దగ్గర పెట్టిన ఉన్మాదులను గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని భారతీయ అంబేద్కర్ సేన(బాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీయం.శివప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని న్యూ అంబేద్కర్ సర్కిల్ వద్ద బుద్ధుని తల వేరుచేసిన ఘటనపై నిరసన దీక్ష చేపట్టారు. ఈ నిరసన దీక్షలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, సీపీఐ రాష్ట్ర నాయకుడు తోపు కృష్ణప్ప పాల్గొని మద్దతు తెలిపారు. బుద్ధుని విగ్రహం ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పీటీయం.శివప్రసాద్ మాట్లాడుతూ ఈ విషయంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. బుద్ధుని కొండను మానవ వికాస కేంద్రంగా, గొప్ప ఆధ్యాత్మిక, చైతన్య కేంద్రంగా రూపొందించాలన్న ఉన్నతాశయంతో బుద్ధ అంబేడ్కర్ సమాజ్ ట్రస్ట్ ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి నిర్మాణాలు చేపట్టామన్నారు. అయితే కొందరు ఉన్మాదులు ఉద్దేశపూర్వకంగా తాము చేస్తున్న అభివృద్ధిని ఒక్కొక్కటిగా ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుద్ధ విగ్రహం ధ్వంసంపై బుధవారం సాయంత్రం రూరల్ సీఐ కళా వెంకటరమణకు, డీఎస్పీ మహేంద్రకు ఫొటోలు పంపి విషయం తెలిపినప్పటికీ స్పందన లేదన్నారు. బుద్ధుడిని, బౌద్ధ అమరావతిని వాడుకుంటూ సౌత్ ఆసియా దేశాల సహకారం పొందుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే ఈ ఘటనపై స్పందించి, పోలీసులకు కఠిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. నిరసన దీక్షలో బాస్ కేంద్ర కమిటీ ప్రతినిధి కె.వి.రమణ, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్, రాష్ట్ర కోశాధికారి నీరుగట్టి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్ల బయన్న, స్థానిక నాయకులు జీవీ రమణ, కృష్ణ, జనార్దన్, రెడ్డెప్ప, సింగన్న, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


బస్టాండులో ఇదే'మండి'.!



నిరుపయోగంగా మారిన ఆర్టీసీ బస్టాండులో మామిడి కాయల క్రేట్లు స్టాకు ఉంచిన దృశ్యం

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో లక్షలాది రూపాయలతో నిర్మించిన ఆర్టీసీ బస్టాండు మామిడికాయల మండీగా మారిపోయింది. బస్టాండును వినియోగించకపోవడంతో ప్రస్తుతం కొంతమంది వ్యాపారులు మామిడికాయల మండీలుగా మార్చుకొని తమ కార్యకలాపాలు నిర్వహించుకొంటున్నారు. రూ.36 లక్షలతో స్థానిక ఇందిరమ్మ కాలనీకి ఎదురుగా ఆర్టీసీ బస్టాండును నిర్మించారు. ఏడాది క్రితం బస్టాండుకు ప్రారంభోత్సవం కూడా నిర్వహించారు. అయితే ఆర్టీసీవారు బస్టాండును వినియోగించకపోవడంతో ఏడాదిగా నిరుపయోగంగా మారిపోయింది. దీంతో కొంతమంది వ్యాపారులు బస్టాండులోనే మామిడికాయల వ్యాపారం ప్రారంభించారు. బస్టాండు బాగా విశాలంగా ఉండడంతో లోడింగ్, అన్‌లోడింగ్, ప్యాకింగ్‌తో పాటు క్రేట్లను బస్టాండులోనే స్టాకు ఉంచుకొంటున్నారు. వీరితోపాటు పలువురు బస్టాండు ప్రాంగణాన్ని అసాంఘిక కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. ప్రయాణికుల సౌకర్యం కోసం గత ప్రభుత్వంలో నిర్మించిన బస్టాండు ఇలా మండీగా మారడం దారుణమని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కనీసం ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకొని బస్టాండును వినియోగంలోకి తెస్తే ఇటు ప్రజలకు అటు ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.

వితంతు పింఛను నగదు వెనక్కు!



పంచాయతీ ఖాతా నుంచి పింఛను నగదు విత్‌డ్రా చేసినట్లు మెసేజ్

కలికిరి : సామాజిక పింఛన్లు పొందుతూ 2023 నవంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య మరణించిన వారి స్థానంలో వారి భార్యలకు పింఛను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఏడాదికి పైగా వితంతు పింఛను కోసం ఎదురు చూసిన వితంతువులకు ఊరట కలిగింది. గత నెల 12వ తేదీన పింఛను నగదు మహిళలకు ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నట్లు 11వ తేదీనే అధికారులు సమాచారమిచ్చారు. పంపిణీకి ఆయా గ్రామాల కూటమి నేతలు సమాయత్తమయ్యారు. పింఛను నగదు ఉదయం పంపిణీ చేయాల్సి ఉండగా ముందు రోజు రాత్రి ఉన్నట్టుండి పింఛను పంపిణీకి బ్రేక్ వేస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో పింఛను కోసం ఎదురు చూసిన వితంతువులకు నిరాశే ఎదురైంది. తిరిగి ఈ నెల 1న రెండు నెలల పింఛను కలిపి పంపిణీ చేయాల్సి ఉండగా ఈ దఫా కూడా వీరికి నిరాశ తప్పలేదు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 2417 మందికి వితంతు పింఛన్లు మంజూరయ్యాయి. రూ.96,68,000 వితంతువులకు పంపిణీ చేయాల్సి ఉంది. జూన్, జూలై నెలలకు కలిపి రూ.1,93,36,000 అందచేయాల్సి ఉండగా వీరికి పింఛను పంపిణీ చేయలేదు. తమ పింఛను ఎందుకు ఆగింది అని అడిగితే సమాధానం చెప్పే నాథుడే కరువయ్యాడు. దీంతో తమకు పింఛన్లు వస్తాయా.. రావా అన్న సందిగ్ధంలో మహిళలు ఉన్నారు. ఇది ఇలా ఉండగా ఇప్పటి వరకు జూన్ నెలకు సంబంధించి ఆయా పంచాయతీ ఖాతాలకు జమ అయిన కొత్త వితంతు పింఛను నగదును ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం ఆయా పంచాయతీ కార్యదర్శులు విత్ డ్రా చేసి సీఎఫ్ఎంఎస్ ద్వారా ప్రభుత్వానికే జమ చేసేశారు. దీంతో వితంతు మహిళలకు ఇప్పట్లో పింఛను లేనట్లేనని తేలిపోయింది.

అనుమానాస్పద వస్తువుల రవాణాపై సమాచారం ఇవ్వాలి



పార్సిల్ ఏజెన్సీలు పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

పీలేరురూరల్ : అనుమానాస్పద వస్తువుల రవాణాపై ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ వారు సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ సీఐ సి.హెచ్. సుబ్బారెడ్డి అన్నారు. ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం పీలేరు పట్టణంలోని పలు ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలను తనిఖీ చేసి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా చేసే ప్యాకెట్‌లో ఏ వస్తువు ఉంటే ఆ వస్తువు వేబిల్లులో ఉండాలని తెలిపారు. ఏదైనా తేడా ఉన్నా, మత్తు పదార్థాలు లాంటి, ఖాళీ బాటిళ్లు, మూతలు లాంటివి రవాణా జరిగినా సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది రత్నం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వం కాదిది.. వంచక ప్రభుత్వం

రాయచోటి : రాష్ట్రంలో ఏడాది పాలనలో ఏదో సాధించినట్లు ఇంటింటికి సంక్షేమం అంటూ కూటమి పాలన చేస్తున్న హడావిడిని చూస్తే సంక్షేమ పాలన కంటే వంచక పాలనగా కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి మండల పరిధిలోని మాధవరం పంచాయతీలోని పల్లె ప్రజలతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి, పార్టీ సీనియర్ నేత, జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి సుబ్రమణ్యం, పోలు సుబ్బారెడ్డిలతో కలిసి రైతులతో మమేకమయ్యారు. గ్రామంలోని ఏ పల్లెకు వెళ్లినా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవని, వారి ఆర్థిక వేదనలు నేతలకు ఆవేదనలుగా మిగిలాయి. కూటమి ప్రభుత్వం మాత్రం ఏడాదిలో తామేదో సాధించినట్లు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచడం దారుణమన్నారు. చెప్పుకోవడానికి చేసిన అభివృద్ధి లేక, ఇచ్చిన హామీలను నెరవేర్చలేని ప్రభుత్వం ప్రజల వద్దకు ఏముఖం పెట్టుకొని వెళుతోందంటూ వారు ప్రశ్నించారు. మామిడికి ధరలు లేక తోటల్లోనే వదిలేశామంటూ నేతల ఎదుట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అదును దాటిపోతున్నా వర్షాలు లేక ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంటగా సాగు చేసే వేరుశనగ, ఇతర వర్షాధార పంటలు సాగు చేయలేక రైతులు దిక్కులు చూస్తున్నారన్నారు. వ్యవసాయ కూలీ పనులు లేక కూలీలు గ్రామాలు వదిలి వలస బాట పట్టారన్నారు. పాలరేట్లు తగ్గడంతో పాడిపై జీవనం సాగిస్తున్న రైతులు మరింత ఆర్థికంగా చితికిపోయారన్నారు. ఈ ప్రభుత్వంలో రైతు భరోసా పెట్టుబడి నిధులు అందక ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు కళ్ల ఎదుట కనిపిస్తున్నాయన్నారు. మామిడికి గిట్టుబాటు ధరలు కల్పించి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 20 వేలు పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏటా రైతు భరోసా డబ్బులు అందేవన్నారు. పంటలు నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా అందేవని, ఈ కూటమి ప్రభుత్వంలో సంవత్సరం దాటిపోయినా రైతు భరోసా ఇవ్వడం లేదన్నారు. పంటలు నష్టపోయినా ఎటువంటి పరిహారం రాలేదన్నారు.

మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత

మదనపల్లె సిటీ : మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మున్సిపాలిటీలోని పాఠశాలలకు బదిలీలు, పదోన్నతులు కల్పించారు. అయితే మున్సిపాలిటీ పరిధిలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించకపోవడంతో విద్యార్థులు ఆయా పాఠశాలల్లో చేరడానికి ముందుకు రావడం లేదు. నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తెలుగు-1, హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తెలుగు 3, హిందీ -1, వివేకానంద మున్సిపల్ (ఆర్ ఆర్ లేవుట్) ఉన్నత పాఠశాలలో తెలుగు -4, హిందీ-3, వివేకానంద మున్సిపల్ (మాయబజార్) ఉన్నత పాఠశాలలో తెలుగు 2, హిందీ -1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాఠశాలలు తెరచి నెల రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు పోస్టులు భర్తీకి నోచుకోలేదు. పోస్టులు భర్తీ చేయాలని యూటీఎఫ్ నాయకులు డీవైఈఓకు వినతి పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి రైతు సమస్యలు పట్టవా?

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



బి.కొత్తకోట : పెట్టుబడి తిరిగి దక్కక తీవ్రంగా నష్టపోయిన రైతుల సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విమర్శించారు. ఏడాది కాలంగా రైతులు పండించిన ప్రతి పంటకూ తీవ్ర నష్టాలు వచ్చాయని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వానికి రైతులను ఆదుకోవాలన్న కనీస ధ్యాస లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఒక ఎకరం టమాటా సాగుకు రూ.2 లక్షల పెట్టుబడి పెట్టాలి. ధర పలికితే రైతులకు ఆదాయం, లేదంటే పెట్టుబడి పైసా దక్కదన్నారు. కూటమి ప్రభుత్వం టమాటా ధరలు పతనమైనప్పుడు మద్దతు ధరలు ఇవ్వకపోగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కేవలం ఒకరోజు మాత్రమే కొద్దిపాటి టమాట కొనుగోలు చేసి చేతులు దులుపుకుందన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఏడు వేల ఎకరాల్లో టమాటా సాగు చేయగా కనీసం రూ.500 కోట్ల పెట్టుబడి నష్టాలను రైతులు చవిచూశారన్నారు. దోస పంటను సాగు చేస్తే కనీస ధర లేక పంటను పొలాల్లోనే వదిలేయాల్సిన పరిస్థితి వచ్చినా ప్రభుత్వానికి పట్టలేదన్నారు. ఈ పంటకోసం ఎకరాకు రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టినా పైసా దక్కలేదన్నారు. కర్బూజ, మామిడి రైతులదీ దయనీయమైన పరిస్థితే అన్నారు. గత ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసిన రైతులకు ఇంతవరకు పరిహారం ఇవ్వలేదన్నారు. ఫెంగల్ తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులకు పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిహారం ఎప్పటికప్పుడు చెల్లించారన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని 48,163 మంది రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు రూ.183.42 కోట్ల రైతు భరోసా నిధులు అందించిన ఘనత గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో పంటలు సాగు చేసి పెట్టుబడులు నష్టపోయిన రైతులను గుర్తించేందుకు సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ధరల పతనంతో నష్టపోయిన రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న ది సిటిజన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ పీఆర్ఎస్‌పీఎస్ రాజు

మదనపల్లె సిటీ : ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ది సిటిజన్ కో ఆపరేటివ్ బ్యాంకు పని చేస్తోందని ఆ బ్యాంకు చైర్మన్ పీఆర్ఎస్‌పీఎస్ రాజు అన్నారు. గురువారం స్థానిక సీటీఎం రోడ్డులోని ది సిటిజన్ కో ఆపరేటివ్ బ్యాంకులో ఖాతాదారుల సమావేశం జరిగింది. ఆరు రాష్ట్రాల్లో 42 శాఖల ద్వారా వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. 2025 మార్చి నాటికి రూ.4378 కోట్లు వ్యాపారం జరిగిందన్నారు. 2016లో ప్రారంభమైన మదనపల్లె శాఖ రూ.42 కోట్ల వ్యాపారం చేసిందన్నారు. డైరెక్టర్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ కేవలం ఐదు నిమిషాల్లో బంగారు రుణాలు ఇస్తామన్నారు. సీనియర్ సిటిజన్లకు 10 శాతం వరకు డిపాజిట్లపై వడ్డీ ఇస్తున్నట్లు తెలిపారు. సొసైటీ ఎండీ నరేంద్రకుమార్ మాట్లాడుతూ వ్యాపార వివరాలు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎం లోకనాథనాయుడు, మేనేజర్ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమిత గుట్టను పరిశీలించిన రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



గుట్ట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శివకుమార్

పీలేరు : మండలంలోని ముడుపుల వేముల పంచాయతీ పరిధిలో 'యథేచ్ఛగా గుట్టలు కబ్జా' అనే శీర్షికన గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. పీలేరు తహసీల్దార్ శివకుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు గురువారం సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. ముడుపులవేముల పంచాయతీ సర్వేనెంబరు 1219, 1220, 1221, 1224 పరిధిలో దాదాపు 30 ఎకరాలు పైగా గుట్ట ప్రాంతం ఉంది. ఆక్రమణదారులు ఈ గుట్టను జేసీబీలతో చదును చేసి ఆక్రమించుకోవడంపై రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గుట్టస్థలాన్ని చదును చేసిన వారిని పిలిపించి ఆ భూమిపై ఎలాంటి హక్కు ఉందో సంబంధిత పత్రాలు తీసుకురావాలని సూచించారు. పరిశీలన నివేదిక జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

బడి బాట కాదు.. భిక్షాటన.!



బడిలో ఉండాల్సిన పిల్లలు భిక్షాటన చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లని పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించాల్సిన విద్యాశాఖ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అందరికీ విద్య అందించాలి అనే లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. మదనపల్లెలో నిత్యం రోడ్లపై ఎందరో చిన్న పిల్లలు భిక్షాటన చేస్తున్నా విద్యా శాఖ అధికారుల దృష్టి వారిపై పడలేదు.

– మదనపల్లె సిటీ



10న గురుపౌర్ణమి వేడుకలు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం కోటవీధిలోని శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో ఈనెల 10వ తేదీన గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సాయిచక్రవర్తి తెలిపారు. ఈ రోజు ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు స్వహస్తాలతో పాలాభిషేకం చేయవచ్చన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలన్నారు.

నేటి నుంచి డిపోల ఎదుట ధర్నాలు

మదనపల్లె సిటీ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు ధర్నాలు నిర్వహించనున్నట్లు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్వీ కుమార్, జిల్లా అధ్యక్షుడు సీఎం బాబు తెలిపారు. ఉద్యోగులకు పదోన్నతులు, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఈయూ నాయకులు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

నేడు పెద్దపీర్ల మెరవణి

పెద్దతిప్పసముద్రం : మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కందుకూరులో శుక్రవారం రాత్రి పెద్దపీర్ల మెరవణి వైభవంగా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఏటా కుల, మతాలకు అతీతంగా జరిగే పీర్ల వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మదనపల్లె రూరల్ : స్థానిక 132 కేవీ. ఈహెచ్‌టీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, నిర్వహణ కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు గంటసేపు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ ఎం.గంగాధరం ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లె టౌన్, రూరల్, సీటీఎం, నిమ్మనపల్లె, కురబలకోట తదితర ప్రాంతాల్లో గంటసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

దేవుని కడపలో వారాహి దేవి మహా శాంతి యాగం



మహా శాంతి యాగ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కడప సెవెన్‌రోడ్స్ : లోక కల్యాణార్థం, లోక క్షేమార్థం వారాహి దేవి మహా శాంతి యాగం నిర్వహించామని అర్చక సమైక్య జిల్లా అధ్యక్షులు విజయభట్టర్ అన్నారు. కడప జిల్లా అర్చక పురోహిత ఐక్యవేదిక కడప జిల్లా విశ్వహిందూ పరిషత్ అర్చక పురోహిత మందిర ఏపీబీఎస్ఎస్ఎస్ బ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో వరాహి దేవి మహా శాంతి యాగం నిర్వహించామని తెలిపారు. దేవుని కడపలోని శ్రీ వేదమాత గాయత్రి దేవస్థానంలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శాంతి యాగం నిర్వహించి భక్తులకు వేద ఆశీర్వాదం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రకంటి ప్రభాకర్ శర్మ, కళ్యాణపురం విజయ బట్టర్, సరస్వతుల శివ సత్య కుమార్ శర్మ, సిద్దవటం రవి ప్రసాద్ శర్మ, జగన్నాథం మురళీ శర్మ, మధురభారతం సుధీర్ శర్మ, అక్షింతల సాగర్ శర్మ, ముంజి శ్రీకాంత్ చర్లపల్లి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని వక్ఫ్ పరిరక్షణ జేఏసీ జిల్లా కన్వీనర్ అహ్మద్ బాషా (బాబు భాయి) అన్నారు. గురువారం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపులో భాగంగా వక్ఫ్ పరిరక్షణ జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఏఓ విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధంగా తయారైన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశామన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను కోరారు. వక్ఫ్ పరిరక్షణ జేఏసీ కడప సిటీ కన్వీనర్ మౌలానా జాకీర్ హుస్సేన్, వక్ఫ్ పరిరక్షణ జేఏసీ నగర జమియతుల్ ఉలేమా కార్యదర్శి మౌలానా సలావుద్దీన్, మజ్లిసే ఇల్మియా నాయకులు మౌలానా షబ్బీర్, జమియతే అహ్లే హదీసు సభ్యులు అన్వర్, కాంగ్రెస్ పార్టీ నసీరుద్దీన్, సి.పియం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్‌సీపీ నాయకుడు ప్రసాద్, ఎస్.డి.పి.ఐ నగర అధ్యక్షుడు జాబిర్ అలి ఖాన్ తదితరులు పాల్గొన్నారు.